6

# ఎత్తుకు పై ఎత్తు

ఒక ఊరిలో 'శిఖామణి' అనే ఘరానా దొంగ ఉండేవాడు.

అతని ఇల్లు ఊరికి దూరంగా నాలుగు రహదారుల కూడలిలో ఉండేది, ఆ ప్రాంతంలో దొంగల భయం కూడా ఎక్కువ. అందువల్ల ఆ దారుల వెంబడి వచ్చే వ్యాపారస్థుల వంటివారు, చీకటి పడితే ఆ ఇంట బస కోరుతుండేవారు. ఆ విధంగా వచ్చేవారిని రకరాకాల మాయమాటలతో మోసపుచ్చి వారి వద్దనున్న ధనాన్ని కాజేస్తుండేవాడు శిఖామణి.

ఆ ఊరికి దగ్గరలోవున్న మరో ఊరిలో 'ధనగుప్త' డనే వ్యాపారి ఉండేవాడు. అతను తన వ్యాపారంలో విశేషంగా ధనం సంపాదించాడు. అతను చనిపోయిన తర్వాత అతని ఆస్తి - కొడుకులైన 'రామగుప్తుడు, చంద్రగుప్తుడు' అనేవారికి సంక్రమించింది. రామగుప్తుడు సౌమ్యుడు, మంచి మనసున్నవాడు.., అమాయకంగా కనిపించేవాడు. చంద్రగుప్తుడు అన్న నెపుడూ తెలివిలేని మూర్ఖుడిగా భావించేవాడు. తనను మించిన తెలివి గలవాడు లేడని గర్వపడుతుండేవాడు. ఆ తెలివితేటలతో అన్నని మోసం చేసి అతని ఆస్తిని కూడా కాజేయాలని ఆలోచిస్తుండేవాడు.

ఒకరోజు చంద్రగుప్తుడు సరుకులు కొనుక్కురావడానికి డబ్బుతీసుకొని పట్నానికి బయలు దేరాడు. దారిలో శిఖామణి ఇంటిని సమీపించేసరికి చీకటి పడింది. అందువల్ల ఆ రాత్రికి అక్కడ బస చేయాలనుకున్నాడు. అటువంటివారి కోసమే ఎదురుచూసే శిఖామణి అతన్ని సాదరంగా లోనికి తీసుకువెళ్లి మర్యాదలు చేశాడు. కడుపునిండా కమ్మని విందుభోజనం పెట్టి, అందమైన తన ఇద్దరు భార్యల చేత సపర్యలు చేయించాడు. వీటన్నిటికి ఉబ్బితబ్బిబ్బై పోయాడు చంద్రగుప్తుడు. అతన్ని మాటల్లో పెట్టి కాలక్షేపం కోసం ఒక వింత ఆట ఆడుదామని అన్నాడు శిఖామణి. అందుకు ఒప్పుకున్నాడు చంద్రగుప్తుడు.

ఆ ఆట ప్రకారం- శిఖామణి చెప్పినదాన్ని 'కాదు' అంటే ... చంద్రగుప్తుడు తన దగ్గరున్న డబ్బంతా ఓడిపోవలసి ఉంటుంది. అలాగే- చంద్రగుప్తుడు చెప్పినదానికి శిఖామణి 'కాదు' అంటే ... అతని సర్వస్వమూ చంద్రగుప్తుడికి వస్తుంది.



ముందు శిఖామణి చెప్పడం మొదలు పెట్టాడు.

"నా దగ్గర మంచి ఆవుంది. అదిచ్చిన పాలు ఎంత యెక్కువంటే. . అవి నదిలాపారి, నా పొలంలో మోకాటి లోతున నిలిచాయి. ఇది అద్భుతం కాదా?" అని అడిగాడు

విందు భోజనంతోనూ, శిఖామణి భార్యల సేవలతోనూ మురిసిపోయిన చంద్రగుప్తుడు పరధ్యాసలో "కాదు, అది అసంభవం..!" అన్నాడు.

అంతే..! చంద్రగుప్తుడు ఓడిపోవటం, అతని డబ్బు శిఖామణి కాజేయడం జరిగింది. బుర్ర గోక్కుంటూ విచారంగా ఇంటి దారి పట్టాడు చంద్రగుప్తుడు. అన్నకు జరిగింది చెప్పి భోరుమన్నాడు.

"సరే... ఈసారి నేను పోయి ఆ శిఖామణి సంగతి చూసొస్తా!" అని బయలుదేరాడు రామగుప్తుడు.

'వీడి ముఖం...ఈ మూర్ఖుడేమి చేస్తాడు..?' అని మనసులోనే అన్న గురించి అనుకున్నాడు చంద్రగుప్తుడు.

రామగుప్తుణ్ణి చూసి ఎప్పటిలాగే మర్యాదగా ఆహ్వానించాడు శిఖామణి. ఎప్పటిలాగే అతడితో పందెం కట్టేడు.

విందుభోజనం ఏర్పాటు చేశాడు. అతని ఇద్దరు భార్యలూ రామగుప్తుడికి చెరోవైపు నుంచుని విసరసాగారు. ఈ సారి ప్రశ్న అడగడం అతని వంతయింది.

"నాకో ఏడంతుస్తుల మేడ వుండేది. ఒకసారి పెనుగాలి వీచి ఆ మేడ ఎక్కడికో ఎగిరిపోయింది. అందులో వాళ్ళంతా ఏమయ్యారో తెలీదు. ఆ సమయానికి నేను ఇంట్లో లేకుండడంతో బ్రతికి బయట పడ్డాను. ఇన్నాళ్ళకి ఇక్కడ నా ఇద్దరు బానిస స్త్రీలు కనిపించారు. ఇది అద్భుతం కాదూ..?" అని అన్నాడు రామగుప్తుడు.

శిఖామణికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. 'కాదు...' అంటే తన సంపదనంతా వదులుకోవాలి. 'అవు' నంటే భార్యలను వదులుకోవాలి.

చాలాసేపు ఆలోచించి చివరకి –"కాదు" అన్నాడు.

వెంటనే అతని ఆస్తినంతా స్వాధీనం చేసుకొని ఇంటి దారి పట్టాడు రామగుప్తుడు. తమ్ముడు పోగొట్టుకున్నది తమ్ముడి కిచ్చాడు. అప్పుడు చంద్రగుప్తుడికి తన అన్న ఎంత తెలివిగలవాడో అర్థమైంది.

తర్వాత కొన్నాళ్ళకి రామగుప్తుడు శిఖామణిని పిలిచి అతనికి బుద్ధి వచ్చిందని నిర్ధారణ చేసుకుని, నాలుగు బుద్ధులు చెప్పి అతని ఆస్తి అతనికిచ్చి పంపాడు. శిఖామణి అప్పటినుంచి మంచిగా వుంటూ అందరికీ నిజమైన అతిథి మర్యాదలు చేస్తూ మంచి పేరు పొందాడు.

★★★